క్లుప్తంగా

బాడీబిల్డింగ్ పోటీల్లో ప్రతిభ


నవీద్

హిందూపురం టౌన్: చెన్నైలో వరల్డ్ ఫిట్‌నెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మిస్టర్ ఇండియా, ఆలిండియా ఓపెన్ బాడీ బిల్డింగ్ కాంపిటీషన్ పోటీల్లో హిందూపురం గోల్డ్ జిమ్‌కు చెందిన పి.నవీద్ ప్రతిభ కనబరిచి నాలుగు పతకాలను సాధించాడు. జూనియర్ మెన్స్ ఫిజిక్ కేటగిరిలో మొదటి స్థానం, సీనియర్ బాడీ బిల్డింగ్ కేటగిరిలో రెండోస్థానం, జూనియర్ బాడీ బిల్డింగ్‌లో రెండో స్థానం, క్లాసిక్ ఫిజిక్ కేటగిరిలో 4వ స్థానం సాధించాడు. ప్రతిభ కనబరిచిన నవీద్‌ను గోల్డెన్ జిమ్ నిర్వాహకులు ఆరీఫ్‌వుల్లా, పట్టణ ప్రముఖులు అభినందించారు.

గుండెపోటుతో కియా ఉద్యోగిని మృతి


దాలమ్మ (ఫైల్)

పెనుకొండ రూరల్: కియా అనుబంధ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికురాలు దాలమ్మ (45)కు సోమవారం గుండెపోటు వచ్చింది. సహచర ఉద్యోగులు వెంటనే పెనుకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలికి భర్త కొల్లప్ప, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

గడ్డివామి దగ్ధం

గుడిబండ: మండల పరిధిలోని మద్దనకుంట గ్రామానికి చెందిన రైతు క్రిష్టప్ప వ్యవసాయ పొలం వద్ద ఏర్పాటు చేసిన గడ్డివాములకు దుండగులు ఆదివారం రాత్రి నిప్పుపెట్టారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే గడ్డివాములు పూర్తిగా దగ్ధంకావడంతో రూ.1.5 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత రైతు క్రిష్టప్ప తెలిపారు. ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కందుల కొనుగోలు కేంద్రం తనిఖీ

రొద్దం: మండల కేంద్రంలోని ఎంపీ పార్థసారథి రైస్ మిల్ వద్ద ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీఓ ఆనంద్‌కుమార్ సోమవారం తనిఖీ చేశారు. కేంద్రం వద్ద రైతులతో మాట్లాడారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆర్డీఓ తెలిపారు.

పశువైద్య సహాయకుడికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న షేక్ అబ్దుల్ రహీం

హిందూపురం అర్బన్ : మండలంలోని బేవనహళ్లి గ్రామ సచివాలయం రైతు సేవా కేంద్రంలో పశు వైద్య సహాయకుడిగా పని చేస్తున్న షేక్ అబ్దుల్ రహీంకు ఏషియన్ ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ, హోసూరు డాక్టరేట్‌ను అందజేశారు. అవార్డు గ్రహీత అబ్దుల్ రహీమ్ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ 19 ఏళ్లుగా హిందూపురం పరిసర ప్రాంతాల్లో పని చేస్తున్నట్లు చెప్పారు. 2019 నుంచి వ్యవసాయ రంగానికి అనుబంధంగా పాడి పరిశ్రమలో రైతులకు మెలకువలు తెలియజేస్తూ సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. తన సేవలు గుర్తించి డాక్టరేట్ ఇవ్వడం జరిగిందన్నారు.

శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం


మాట్లాడుతున్న చైర్మన్, ఈఓ

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షి వీరభద్ర స్వామి దేవాలయంలో మంగళవారం నుంచి మార్చి 1వ తేదీ వరకూ నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్, ఈఓ నరసింహమూర్తి పేర్కొన్నారు. సోమవారం లేపాక్షి దేవాలయం ఆవరణంలో వారు విలేకరులతో మాట్లాడారు. భక్తాదులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. శివరాత్రి రోజున స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశామన్నారు. 27న శివపార్వతుల బ్రహ్మరథోత్సవాన్ని జరుపుతామన్నారు.

కట్టుదిట్టమైన బందోబస్తు

లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో, విజయవంతంగా నిర్వహించుకోవాలని డీఎస్పీ మహేష్ తెలిపారు. సోమవారం రాత్రి స్థానిక ఆర్‌జేహెచ్ ఫంక్షన్ హాల్‌లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ మహాశివరాత్రి, బ్రహ్మరథోత్సవం, పూలపల్లకీ రోజుల్లో అందరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ జనార్దన్, ఎస్ఐలు మునీర్‌అహ్మద్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హర హర మహాదేవ

- రేపు మహాశివరాత్రి వేడుకలు
- జాగరణ చేసేందుకు శైవక్షేత్రాల్లో ఏర్పాట్లు


నిరాకారుడైన శివుడు లింగాకారంలో దర్శనమిచ్చిన రోజునే మహా శివరాత్రిగా జరుపుకుంటున్నాం. హిందువులకు అత్యంత పవిత్రమైన ఆ రోజు ఎంతో మంది ఉపవాస దీక్షలతో ఆ పరమేశ్వరుడిని ప్రార్థిస్తుంటారు. రాత్రంతా జాగరణ చేస్తూ లయకారుడి సేవలో తరిస్తారు. 26వ తేదీ మహాశివరాత్రి నేపథ్యంలో హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని శైవక్షేత్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



40 అడుగుల శివయ్య విగ్రహం

హిందూపురం అర్బన్: మండల పరిధిలోని సడ్లపల్లిలోని బెంగళూరు రోడ్డుకు ఆనుకొని వెలసిన శివాలయానికి ఎంతో విశిష్టత ఉంది. 40 అడుగుల ఎత్తువున్న శివయ్య విగ్రహం భక్తులతో పాటు అటు వెళ్లే వారందరినీ భక్తిపారవశ్యులను చేస్తుంటుంది. మహాశివరాత్రి సందర్భంగా గిరిజా కల్యాణం, దీపోత్సవం కార్యక్రమాలను నిర్వహిస్తామని అర్చకుడు వెంకటరమణ తెలిపారు.

విజయనగర రాజుల పాలనకు చిహ్నం



పెనుకొండ: పట్టణంలోని కాశీ విశ్వేశ్వరాలయం ఎంతో పవిత్రమైంది. విజయనగర రాజులు ఈ ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో ఎక్కడ చూసినా విజయనగర రాజుల చిహ్నాలే దర్శనమిస్తాయి. ప్రతి శివరాత్రికి ఇక్కడ ప్రత్యేక పూజలు, దీపారాధన కార్యక్రమాలు చేపడతారు. శివరాత్రి దగ్గర పడుతుండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

కాలి నడకన తెచ్చిన శివలింగం



అమరాపురం: మండల కేంద్రంలోని కోట వీధిలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయానికి ప్రత్యేకత ఉంది. చెంచుభట్లు వంశస్తులైన భాస్కరశాస్త్రి అమరాపురం నుంచి 1862లో కాలినడకన కాశీకి వెళ్లారు. అక్కడి నుంచి మళ్లీ కాలి నడకనే శివలింగాన్ని తలపై మోసుకుని రెండేళ్ల తర్వాత అమరాపురం చేరుకొని ఆలయంలో లింగాన్ని ప్రతిష్ఠించారు. నాటి నుంచి ఆలయంలో పూజలు నిరాటంకంగా జరుగుతున్నాయి. మహాశివరాత్రిని ఎంతో వైభవంగా నిర్వహిస్తారు.

బండరాయి కింద వెలసిన విరుపాక్షేశ్వరుడు



గుడిబండ: మండల పరిధిలోని పీసీ గ్రామం పొలిమేరలో పెద్ద బండరాయి కింద పార్వతీ సమేత విరుపాక్షేశ్వరుని ఆలయం వెలసింది. 1958 సంవత్సరంలో చోళరాజులు ఈ ఆలయాన్ని నిర్మించారు. ప్రతి ఏటా శివరాత్రి పండుగ సందర్భంగా విశేష పూజలు, భజనలు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతుంటాయి.

శివయ్య పాదం మోపిన ప్రాంతం




రొద్దం: మండల కేంద్రంలోని పెన్నానది ఒడ్డున వెలసిన పురాతన రుద్రపాద ఆశ్రమంలోని శివాలయంలో శివరాత్రి మహోత్సవాలు ఎంతో వైభవంగా నిర్వహిస్తారు. ఇక్కడ శివుని పాదం ఉండటంతో రుద్రపాద ఆశ్రమం అని పేరు వచ్చింది. తూర్పు వైపు నుంచి రుద్రుడు నరకాసురిని తరుముకుంటూ వెళ్లే క్రమంలో ఇక్కడ పెన్నానది ఒడ్డున పాదం మోపినట్లు చరిత్ర చెబుతోంది. ఆ పాదానికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు స్వామివారిని దర్శించుకుంటుంటారు.

మహిమాన్వితుడు చాలకూరు శివయ్య



సోమందేపల్లి: మండలంలోని చాలకూరులో మహాశివరాత్రి సందర్భంగా శివాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ లింగ రూపంలో స్వామివారు దర్శనం ఇస్తారు. కోరిన కోర్కెలు తీర్చేదైవంగా శివయ్యను చుట్టుపక్కల గ్రామాల్లోని ప్రజలు పూజిస్తుంటారు. మహాశివరాత్రి రోజున అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు గౌతమ్‌శాస్త్రి తెలిపారు.

సాల గ్రామశిలతో దర్శనమిచ్చే చౌళేశ్వరస్వామి




లేపాక్షి: మండలంలోని మానేపల్లిలో వెలసిన చౌళేశ్వరస్వామి మహిమాన్వితుడుగా విరాజిల్లుతున్నారు. ఈ ఆలయాన్ని హేలంబి చోళరాజుల కాలంలో నిర్మించినట్లు గ్రామ పెద్దలు చెబుతున్నారు. సాల గ్రామశిలతో 9 అడుగుల విగ్రహాన్ని ఇక్కడ ప్రతిష్ఠించారు. రాయల కాలంలోనూ ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. ప్రతి శివరాత్రికి ఇక్కడ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

కోరిన కోర్కెలు తీర్చే జడే శంకేశ్వరుడు



అగళి: మండల కేంద్రంలోని శివారు కొడిపల్లి రోడ్డు పక్కన ఉన్న అతి ప్రాచీన జడే శంకేశ్వర స్వామి దేవాలయం భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతోంది. విజయనగర రాజుల కాలంలో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. కోరిన కోర్కెలు తీర్చే అద్భుత శక్తి కలిగిన శివలింగమని భక్తుల విశ్వాసం.

జనమేజయుడు నిర్మించిన పంచనందీశ్వరాలయం



చిలమత్తూరు: మండలంలోని కొడికొండలో 8 శతాబ్దం కంటే ముందు అర్జునుడి ముని మనుమడు జనమేజయుడు పంచనందీశ్వరాలయం నిర్మించి త్రిలింగాలను ప్రతిష్ఠించినట్లు శాసనాలు చెబుతున్నాయి. నేటికీ స్వామి నిత్య పూజలు అందుకుంటుండటం విశేషం. యుద్ధానికి వెళ్లే సమయంలో త్రిలింగాలను ప్రతిష్ఠించినట్లు శాసనాలు తెలియజేస్తున్నాయి. ఏటా శివరాత్రి ఉత్సవాలు ఇక్కడ వైభవంగా నిర్వహిస్తారు.

స్వయంభూగా వెలసిన సంగమేశ్వరుడు



పరిగి: మండలంలోని ఊటుకూరు సమీపంలో ఉన్న సంగమేశ్వరాలయంలోని సంగమేశ్వరుడు శ్రీకృష్ణదేవరాయ కాలం కంటే ముందు స్వయంభూగా వెలిశారట. లింగాయత్ కులానికి చెందిన ఓ వ్యక్తి కాశీకి వెళ్తుండగా మార్గ మధ్యలో అతనికి స్వప్నంలో స్వామివారు కనిపించి ఎంతో దూరంలో ఉన్న కాశీకి వెళ్లనక్కర్లేదని తానిక్కడే కొలువై ఉన్నట్లు చెప్పారట. దీంతో ఆయన జయమంగళి, పెన్నానది నదుల మధ్య కొలువుదీరిన స్వామివారిని దర్శించుకున్నారట. నాటి నుంచి నేటి దాకా మహిమాన్విత ఆలయంగా సంగమేశ్వరాలయం విరాజిల్లుతోంది. శివరాత్రికి శివపార్వతుల కళ్యాణోత్సవం, రథోత్సవం, పూల తేరు, అగ్నిగుండం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

మడకశిరలో పంచలింగ దర్శనం



మడకశిరరూరల్: మహాశివరాత్రి వేడుకలకు దేవాలయాలు ముస్తాబు చేశారు. మడకశిర పట్టణంలోని చంద్రమౌళేశ్వరస్వామి, భోగిరామేశ్వరస్వామి, శంకరలింగేశ్వరస్వామి, స్వయంభువనేశ్వరి, రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో పంచలింగాలు ఉన్నాయి. ఈ దేవాలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటుంటారు.

కొండల మధ్య వెలసిన మల్లికార్జునుడు



పెనుకొండ రూరల్: మండలంలోని గొందిపల్లి సమీపంలోని శ్రీకైలాసంలో మల్లికార్జునేశ్వరుడు కొలువుదీరారు. కొండలపై నుంచి నిత్యం జలధార ప్రవహిస్తూ ఉంటుంది. పురాతనమైన ఏడుగురు అక్కమ్మగార్ల దేవాలయం ఉండటం, చుట్టుపక్కల ఆహ్లాదకరమైన వాతావరణం ఉండటంతో భక్తులు నిత్యం ఇక్కడికి వస్తుంటారు. మహాశివరాత్రి నేపథ్యంలో ప్రత్యేక పూజలు, హోమాలతో పాటు కోలాటం, భజనలు నిర్వహిస్తుంటామని అర్చకులు తెలిపారు.

జాతీయ సమైక్యత శిబిరంలో ప్రతిభ


దుర్గను అభినందిస్తున్న అధ్యాపకులు

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎస్‌ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న జే. దుర్గ మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో వారం రోజుల పాటు జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో ప్రతిభ కనబరిచినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి తెలిపారు. సోమవారం స్థానిక కళాశాలలో దుర్గను కళాశాల బృందం అభినందించింది. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జానపద నృత్యంలో దుర్గ ప్రతిభ చూపి కళాశాల కీర్తిని ఇనుమడింప చేసిందన్నారు. అనంతరం విద్యార్థినికి సర్టిఫికెట్‌ను అందజేశారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం


కోనాపురంలో పార్టీ శ్రేణులతో కలిసి కాఫీ తాగుతున్న ఉషశ్రీచరణ్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

పరిగి: ఎన్నికలకు ముందు అరచేతిలో స్వర్గం చూపించి, మీ జీవితాలన్నీ మారిపోతాయని నమ్మబలికి తీరా అధికారమొచ్చాక ఒక్క నయా పైసా కూడా నేటికీ అందించలేకపోయారని కోనాపురం గ్రామ ప్రజలు మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ఎదుట వాపోయారు. మండలంలోని మోదా పంచాయతీ పరిధి కోనాపురంలో సోమవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్ కార్యక్రమంలో ఉషశ్రీచరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ నేటికీ జగనన్న చేసిన మేలును ప్రజలు మరిచిపోలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ అయినా కూటమి ప్రభుత్వం అమలు చేసిందా అని ప్రశ్నించారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు స్వచ్ఛందంగా తమ బాధలను చెప్పుకోడానికి ముందుకొస్తున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీటీసీ నారాయణరెడ్డి, శకుంతలమ్మ, మారుతీరెడ్డి, మండల, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శుభకార్యం

పరిగి: మండలంలోని పుట్టగూర్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు గజేంద్రరెడ్డి సోదరి వివాహ ఆదివారం ఘనంగా జరిగింది. సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పుట్టగూర్లపల్లికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించారు.

కావేరప్పకు ఘన నివాళి

మడకశిరరూరల్: మండలంలోని నీలకంఠాపురంలో మాజీ మంత్రి ఎన్ రఘువీరారెడ్డి తండ్రి కావేరప్ప వర్ధంతిని సోమవారం నిర్వహించారు. కావేరప్ప సమాధి వద్ద రఘువీర కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం స్వగృహంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

కేబుల్ అపహరణ

అమరాపురం: మండల పరిధిలోని బసవనపల్లికి చెందిన రైతు రవి పొలంలో బోరు బావి, స్టార్టర్‌కు అమర్చిన 40 మీటర్ల కేబుల్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. దీనిపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపారు.

కాలిపోయిన డ్రిప్పు పరికరాలు

పెనుకొండ రూరల్: మండలంలోని కొండంపల్లిలో రైతు చిరంజీవికి చెందిన డ్రిప్పు వైర్లు కాలిపోయాయి. బాధిత రైతు వివరాలమేరకు.. కొండంపల్లిలోని శెట్టిపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అర ఎకరా పంటకు పెట్టిన డ్రిప్పు పరికరాలు కాలిపోయాయన్నారు. రూ.10 వేల వరకూ నష్టం వచ్చిందన్నారు.

ధర్నాకు తరలిరండి

సోమందేపల్లి: నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని మార్చి 3న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు పిలుపునిచ్చారు. సోమవారం సోమందేపల్లిలో ఇళ్లు లేని వారిని కలిసి ఆయన ధర్నాకు సంబంధించిన కరపత్రాలు అందజేశారు.

'సేంద్రియం'తో అధిక దిగుబడులు

అగళి: సేంద్రీయ వ్యవసాయం పద్ధతుల ద్వారా పంటలను సాగు చేసి రైతులు ఆదాయం పొందాలని రైతు సాధికార సంస్థ కమ్యూనికేషన్ టీమ్ సభ్యురాలు మల్లేశ్వరి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని తోనసనపల్లిలో రైతు లక్కమ్మ పొలంలో ఘన జీవామృతంతో నవధాన్యాల విత్తనాలను 1.50 ఎకరాలో సాగు చేయించారు. కార్యక్రమంలో డివిజన్ ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జ్ రమేష్, యూనిట్ ఇన్‌చార్జ్ లక్ష్మీకాంత్, ఐసీపీఆర్ ఉమాదేవి పాల్గొన్నారు.

ప్రతిపక్ష హోదా ఇచ్చేందుకు భయమెందుకు?

మడకశిరరూరల్: ప్రజాదరణ ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అసెంబ్లీలో ప్రతి పక్ష హోదా కల్పించడానికి కూటమి ప్రభుత్వానికి భయమెందుకని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. హోదా ఇస్తే అసెంబ్లీలో రైతు సమస్యలతో పాటు ప్రభుత్వ వ్యతిరేక విధానాలు, సూపర్ సిక్స్ హామీలపై నిలదీస్తారనే ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీకి 40 శాతం ప్రజా మద్దతు ఉందని గుర్తు చేశారు.

సంక్షిప్త సమాచారం

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

పెనుకొండ: విద్యార్థుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీసత్యసాయి కళాశాలలో ఎస్ఎఫ్ఐ 6వ జిల్లా మహాసభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వెంటనే సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. లేకపోతే ఆందోళనలకు సిద్ధమవుతామన్నారు. సమావేశంలో నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కమిటీని ఎన్నుకున్నారు.

సంఘాల బలోపేతానికి కృషి

అమరాపురం: మండలంలో మహిళా సంఘాలను బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీఎం ముత్యాలప్ప సూచించారు. సోమవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఆనిమేటర్లు, వీఓ లీడర్లతో సమావేశం నిర్వహించారు.

నేడు లేపాక్షిలో సమీక్ష సమావేశం

లేపాక్షి: స్థానిక లేపాక్షిలోని వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు హిందూపురం, మడకశిర వ్యవసాయశాఖ డివిజన్లకు సంబంధించిన ఇన్‌పుట్ డీలర్లకు సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఏఓ శ్రీలత తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయశాఖ అధికారి హాజరవుతారన్నారు.

డీవైఈఓగా పద్మప్రియ

పెనుకొండ: పెనుకొండ డీవైఈఓగా పద్మప్రియ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిలమత్తూరు మండల విద్యాధికారిగా ఉన్న ఆమెకు డీవైఈఓగా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. విద్యార్థులకు మెరుగైన విద్య అందించేలా కృషి చేస్తానని పద్మప్రియ పేర్కొన్నారు.

పోలీసుస్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు

చిలమత్తూరు: వచ్చే నెలలో జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ప్రశ్నపత్రాలు స్థానిక పోలీసుస్టేషన్‌కు చేరాయి. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ప్రశ్నపత్రాల బాక్సులను చిలమత్తూరులోని పీఎస్‌కు తీసుకువచ్చి భద్రపరిచారు.

వేడినీళ్లు పడి వంట కార్మికులకు గాయాలు

రొద్దం: మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో సోమవారం వేడి నీటిలోకి బియ్యం వేస్తున్న సమయంలో వేడి నీళ్లు పడి వంట కార్మికులు నరేష్, రాజు గాయపడ్డారు. వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు.

ఫేక్‌కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

పెనుకొండ: ఫేక్ కాల్స్‌పై నగర పంచాయతీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల 6300905117, 7980750650 నంబర్ల నుంచి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు, వ్యాపారులు, ప్రజలకు ఫోన్లు చేసి వెంటనే ఇంటి ట్యాక్స్, ట్రేడ్ లైసెన్సు ఫీజులు చెల్లించాలని ఫేక్ అకౌంట్ నంబర్లు, ఫోన్‌పే చేయాలని తప్పుడు సమాచారం ఇస్తున్నారన్నారు.

పావగడలో రైతుల ర్యాలీ


నిరసన ర్యాలీలో పాల్గొన్న రైతులు

పావగడ: 'విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయకపోవడంతో మోటారు పంపుల నుంచి పంట పొలాలకు సకాలంలో నీరందక పంటలు మొక్కదశలోనే వాడిపోతున్నాయంటూ పావగడలో రైతులు ఆందోళనకు దిగారు. నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ విద్యుత్ కార్యాలయం ఎదుట సోమవారం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. అనంతరం బెస్కాం అధికారులకు వినతి పత్రం అందించారు. అధికారుల నిర్లక్ష్యంపై స్థానిక కర్ణాటక రాజ్య రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు.